క్లుప్తంగా

పీటీఎంలో ముగిసిన గంగ జాతర



పీటీఎంలో పూజలందుకున్న గంగ, గౌరీ ప్రతిమలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పీటీఎం, రంగసముద్రం, అంకిరెడ్డిపల్లి, మడుమూరు, మద్దయ్యగారిపల్లి తదితర గ్రామాల్లో రెండు రోజులుగా నిర్వహించిన గంగ జాతర ముగిసింది. పీటీఎంలో నడివీధి నల్లగంగమ్మ జాతర వేడుకలు బుధవారంతో ముగిసాయి. జాతరలో భాగంగా భక్తులు గంగమ్మకు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. మహిళలు చలిపిండి దీపాలతో జ్యోతులు మోశారు. స్థానిక సంత బజార్‌లో ప్రతిష్టించిన గంగ, గౌరీ ప్రతిమల ఎదుట మండల వాసులే గాక కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి జాతరను తిలకించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

నేటి నుంచి గుంటిగంగమ్మ జాతర

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి బాహుదానది ఒడ్డున వెలసిన శ్రీ గుంటిగంగమ్మ జాతర ఈ నెల 4, 5వ తేదీలల్లో నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అమ్మవారికి అర్చన, అభిషేకాలు, ప్రత్యేక పుజలు నిర్వహించి, 4వ తేది రాత్రి చాందినీబండ్లు, అన్నదానం బండ్ల, పానకం బండ్లు ఊరేగించనున్నారు. 5న పగలు తిరునాల, దీలు, బోణాలు సమర్పించనున్నట్లు తెలిపారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని గ్రామస్థులు కోరారు.

స్వీట్ స్టాల్‌పై దాడులు



బేకరీ ఐటమ్స్ సీజ్ చేస్తున్న సిబ్బంది

మదనపల్లె సిటీ : స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర బేకరీ, స్వీట్ స్టాల్‌పై బుధవారం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడులు చేసినట్లు సీనియర్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ కె.షమీమ్ బాషా తెలిపారు. స్వీట్‌స్టాల్‌లో గడువు ముగిసిన ఫుడ్ ఐటమ్స్‌ను గుర్తించారు. స్వీట్స్, బేకరీ ఐటమ్స్‌లో అధిక రంగులు కలుపుతున్నట్లు గుర్తించారు. వీటినన్నింటిని సీజ్ చేశారు. అలాగే ఫుడ్ సర్టిఫికెట్ లేకపోవడంపై నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

హెల్పింగ్‌మైండ్స్ లోగో ఆవిష్కరణ

మదనపల్లె సిటీ : సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హెల్పింగ్‌మైండ్స్ సంస్థ 11వ వార్షికోత్సవ లోగోను బుధవారం సంస్థ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్ ఆవిష్కరించారు. రక్తదానంతో మొదలుపెట్టి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 7న స్థానిక శ్రీకృష్ణ కళ్యాణమండపంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు.

రిటైర్డ్ డీవైఈఓకు ఘన సన్మానం



ఆనందరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

పీలేరు : ఇటీవల పదవీ విరమణ పొందిన తిరుపతి డీవైఈవో ఎం. ఆనందరెడ్డికి ఘనంగా సన్మానం చేశారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవోలు, మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కలసి పూల మాలలు, దుశ్శాలువలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యారంగానికి ఆనందరెడ్డి చేసిన సేవలు ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఆయన శేషజీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో పద్మావతి, ప్రధానోపాధ్యాయులు సురేంద్రరెడ్డి, వేణుగోపాల్, గంగాధరం, నటరాజ, శోభారాణి, ఫౌజియాబేగం, ఫ్యారూఖాన్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనల వైపు ఆసక్తి పెంచుకోవాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులలో పఠనాశక్తిని పెంచి, పరిశోధనల వైపు ఆసక్తిని పెంచుకోవాలని రిటైర్డు భౌతిక శాస్త్ర ఆచార్యులు సికె జయశంకర్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో జయశంకర్ భౌతికశాస్త్ర ప్రాథమిక అంశాలు అనే అంశంపై అతిథి ఉపన్యాసం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంను కూడా పెంచుకోవాలన్నారు. విద్యార్థులు విషయ పరిజ్ఞాన పరిధి విస్తృతంగా అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి, అధ్యాపకులు సూర్యశేఖర్‌రెడ్డి, మోహన్‌వల్లి, కుసుమప్రియ పాల్గొన్నారు.

బాబు కుట్రకు పండుటాకులు విలవిల

- ఎర్రటి ఎండలో పింఛన్ల కోసం వృద్ధుల ఎదురుచూపు
- సచివాలయాల వద్దకు రాలేక అవస్థలు
- బాబు కూటమికి పింఛనర్ల శాపనార్థాలు



వాల్మీకిపురం : పింఛన్ కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు

కురబలకోట : వలంటీర్ల వ్యవస్థ వచ్చినప్పటి నుంచి పింఛన్ల కోసం ఆఫీసు గుమ్మం తొక్కలేదు. ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచనుగా ఇంటి వద్దకే వచ్చి తలుపు తట్టి పింఛన్ అందించేవారు. చంద్రబాబు పండుటాకులపై పగబట్టారు. వలంటీర్లపై విషయం చిమ్ముతూ నిమ్మగడ్డ ప్రసాద్‌తో ఫిర్యాదు చేయించి వారి సేవలను అడ్డుకున్నాడు. చంద్రబాబు పాలనలో లాగా పండుటాకులను రోడ్లు ఎక్కించి ఆఫీసుల వద్ద పడిగాపులు కాసేలా చేస్తున్నాడు. మా ఉసురు తగలకపోదని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లో పింఛన్ల పంపిణీ సచివాలయాల వద్ద ప్రారంభమైంది. ఉదయం నుంచి పింఛన్ల కోసం పండుటాకులు, దివ్యాంగులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. వలంటీర్లు ఉన్నప్పుడు తెలవారక ముందే ఇంటి తలుపు తట్టి పింఛన్ ఇచ్చేవారు. కాలు బయట పెట్టకుండా చేతికి అందేది. మళ్లీ పాత రోజులు రావడం తలచుకుంటే భాదేస్తుందని వాపోతున్నారు. అసలే మండుటెండలు మరో వైపు వ్యయప్రయాలకు గురికావాల్సి వస్తోందని వేదన పడుతున్నారు. సచివాలయాల వద్ద బారులు తీరాల్సి రావడంతో పింఛన్ టెన్షన్‌తో సతమతం అవుతున్నారు.

పెన్షన్ల కోసం పడిగాపులు

పీలేరు : వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత అవ్వాతాతలకు గ్రామ వలంటీర్లు ఇంటివద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేసేవారు. పండుటాకులు ఎలాంటి వ్యయప్రాయాసలకు లోనుకాకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్ద ఉంటూనే పింఛన్లు పొందుతూ వచ్చారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో గ్రామ వలంటీర్ సేవలు నిలిపివేశారు. దీంతో ఈ నెల పింఛన్ పొందడానికి గ్రామ సచివాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయడంతోనే తమకు ఇంటి వద్దకు పింఛన్ రాకుండా పోయిందని, పండుటాకుల ఉసురు తగులుతుందని పలువురు శాపనార్థాలు పెట్టారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం : ప్రతి నెలా వలంటీర్‌ల ద్వారా ఒకటో తేదినే ఠంచన్‌గా పింఛన్ పంపిణీ జరిగేది. ప్రతిపక్షనేత నారా చంద్రబాబు నాయుడు వలంటీర్ వ్యవస్థపై ఆరోపణలు చేయడంతో పింఛన్ పంపిణీకి వలంటీర్లు దూరంగా ఉండాల్సి వచ్చింది. దీంతో ఒకటవ తేది అందాల్సిన పింఛన్ మూడవ తేది నుంచి మొదలైంది. ఉదయం నుంచే వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఆయా సచివాలయాల వద్దకు చేరుకొని, పింఛన్ కోసం పడిగాపులు పడాల్సి వచ్చింది. ఎట్టకేలకు మధ్యాహ్నం 3గంటల నుంచి పింఛన్ పంపిణీ ప్రారంభించడంతో ఊపిరి పీల్చుకున్నారు. చంద్రబాబుకు మాలాంటి వాళ్ల ఉసురు తగులుతుందని వాపోయారు.

కలకడలో..

కలకడ : మండలంలోని వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్‌ల ద్వారా ప్రతి గడపకు ఉదయం 5గంటలకే పింఛన్ అందేలా చేశారు. అయితే దీనిని జీర్ణించుకోలేక చంద్రబాబు కుట్ర పన్ని వలంటీర్ల సేవలకు విఘాతం కల్పించారని వృద్ధులు వాపోతున్నారు. బుధవారం ఉదయం నుంచి సచివాలయాల వద్ద పడిగాపులు కాచినా పింఛన్ ఇవ్వలేదు. చేసేదిలేక చంద్రబాబు, ఆయన కూటమిపై శాపనార్థాలు పెడుతూ వెనుతిరిగారు. వలంటీర్లు లేకపోతే ఎండకు కిలోమీటరు దూరం నుంచి వచ్చి, సాయంత్రం వరకు ఎదురు చూడాలంటే వయస్సు సహకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



పీలేరు : అగ్రహారంలో పింఛన్ల కోసం క్యూలో వృద్ధులు



కురబలకోట మండలంలో పింఛన్ల కోసం పడిగాపులు



కలకడ సచివాలయంవద్ద వృద్ధులు

వృద్ధుల శాపనార్థాలు చంద్రబాబుకు తగులుతాయ్

పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ : రాష్ట్రంలో వృద్ధులు, దివ్యాంగుల శాపనార్థాలు చంద్రబాబునాయుడుకు తగులుతాయని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తరిగొండ, మెరంపల్లె గ్రామాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లను విధులకు దూరం చేసి టీడీపీ వాళ్లు పింఛన్ దారుల గోడు మూటగట్టుకొన్నారన్నారు. వలంటీర్లులేకపోతే ఎలాం ఉంటుందో టీడీపీ వాళ్లకు మూడు రోజులుగా అర్థమయ్యిందన్నారు. వృద్ధులు, వికలాంగులు మండుటెండలో సచివాలయల దగ్గర పడిగాపులు కాస్తుండడం దారుణమన్నారు. ఈ పాపం అంతా చంద్రబాబుకు, టీడీపీనేతలకే దక్కుతుందన్నారు. టీడీపీ బీజీపీతో జతకట్టడంతో మైనార్టీల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిగానీ, టీడీపీ అభ్యర్థి కిషోర్‌కుమార్‌రెడ్డిగానీ ఎన్నడూ ప్రజల మధ్య ఉండలేదన్నారు. ఇలాంటి వారిని నమ్మి ఓట్లు వేస్తే ప్రజలు మరోసారి మోసపోతారన్నారు. రాబోయే ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరముందన్నారు.

అక్రమబోర్లపై చర్యలు తీసుకోండి

కలెక్టర్‌కు దళితుల వినతి

గుర్రంకొండ : తాగునీటిబోరుకు దగ్గరలో అక్రమంగా బోర్లు వేయడంతో తాగునీటి బోరు ఎండిపోయి నీటి సమస్య నెలకొందని, వెంటనె అక్రమబోర్లపై చర్యలు తీసుకోవాలని మండలంలోని టి.రాచపల్లె పంచాయతీ ఎగువబురుజుపల్లె దళితవాడకు చెందిన దళితులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. బుధవారం వారు రాయచోటిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దళితవాడలో గతంలో ప్రభుత్వం వారు తాగునీటి బోరు వేసి అన్ని వసతులు కల్పించారన్నారు. అయితే ఇటివల గ్రామానికి చెందిన నరసింహారెడ్డి అనే వ్యక్తి తాగునీటి బోరుకు దగ్గరలోనే రెండు బోర్లు వేశారన్నారు. దీంతో దళితవాడలోని తాగునీటి బోరు ఎండిపోయిందన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యనెలకొనడంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ప్రతి రోజు వ్యవసాయబోర్ల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. స్థానిక అధికారులకు పలుమార్లు తాగునీటి సమస్యపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.ఈ విషయమై విచారణ జరిపి అక్రమంగా వేసిన బోర్లను సీజ్ చేసి దళితవాడలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారించాలని వారు కోరారు,

ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

పీలేరు రూరల్ : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో ప్రజలు తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రేగళ్లు, నాలేవాండ్లపల్లె గ్రామాల్లో కేంద్ర సాయుధ బలకాలు, పోలీస్ సిబ్బందిచే కవాతు చేపట్టారు. అనంతరం గ్రామాల్లో ప్రజలకు శాంతి భద్రతలపై అవగాహన కల్పించార. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగ కుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరసింహుడు, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.



రేగళ్లులో కేంద్రబలగాలు, పోలీస్ అధికారులు కవాతు చేస్తున్న దృశ్యం

సైన్సుపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి




విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రొఫెసర్లు విజయభాస్కరరావు, దేవప్రసాదదరాజు

మదనపల్లె సిటీ : విద్యార్థులు సైన్సుపై అవగాహన పెంచుకోవాలని ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు విజయభాస్కరరావు, దేవప్రసాదదరాజు అన్నారు. బుధవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో మూడు రోజులపాటు నిర్వహించిన ఇండియన్ సైన్సు అకాడమీ అవగాహన సదస్సులు ముగిశాయి. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి సైన్సు పట్ల ఆసక్తి కనపరుస్తూ చిన్న చిన్న ప్రయోగాలు చేస్తూ మంచి విజయాలు సాధించవచ్చునన్నారు. యుజీసీ ప్రొఫెసర్ జయశంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, కో ఆర్డినేటర్ రామాంజులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూములు పరిశీలించిన జేసీ

పీలేరు రూరల్ : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూములను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ పరిశీలించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ సంజయ్‌గాంధీ డిగ్రీ కళాశాలలో ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు, ఎన్నికల మెటీరియల్స్ భద్రపరచడానికి అనువుగా స్ట్రాంగ్ రూములు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గం 163కి సంబంధించి ఆరు మండలాలకు అవసరమైన ఎన్నికల సామగ్రి ఇక్కడ భద్రపరచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలన్నారు. అన్ని పార్టీలు తమ ప్రచారాలకు అవసరమైన అనుమతులు పొందాలన్నారు. ఎన్నికలు శాంతియుతంగా జరగడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎన్నికల డీటీలు సుబ్రమణ్యం, కిరణ్, ఆర్ఐ చాణక్య, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూములు పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్‌అహ్మద్

ఎంజేఆర్‌లో ఘనంగా జెనిత్ 2కే24



సాంస్కృతిక కార్యక్రమంలో హాస్యనటులు

పీలేరు రూరల్ : స్థానిక చిత్తూరు మార్గంలోని ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జెనిత్ 2కే24 ఘనంగా నిర్వహించారు. బుధవారం జరిగిన కార్యక్రమానికి వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 128 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి పేపర్ ప్రెసెంటేషన్, పోస్టర్ ప్రెసెంటేషన్, టెక్నికల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ ఎం.పి. అవినాష్ కుమార్ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం హీరోయిన్ స్పందన, ప్రముఖ హాస్యనటులు రవికిషోర్, అవినాష్, తాగుబోతు రాజమౌళి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమంతా సిద్ధం సభ విజయవంతం

- సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు
- జగనన్న ప్రభుత్వానికి పేదలే స్టార్ క్యాంపెయినర్లు
- వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్ ఖాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, వైఎస్సార్ సీపీ నాయకులు

మదనపల్లె : నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలందరి సహకారంతోనే మేమంతా సిద్ధం బస్సుయాత్ర, బహిరంగ సభ విజయవంతమైందని ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి తెలిపారు. మేమంతా సిద్ధం బహిరంగసభ విజయవంతమైన నేపథ్యంలో ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపేందుకు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేమంతా సిద్ధం సభ విజయవంతానికి శ్రమించిన ప్రతి ఒక్కరికీ పేరు,పేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. బస్సు యాత్ర షెడ్యూల్‌లో మదనపల్లె పేరు ప్రకటించిన తక్కువ వ్యవధిలోనే, నియోజకవర్గ చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా సభను ఏర్పాటుచేసి, విజయవంతం చేయడం సాధారణ విషయం కాదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రేమతో, ఎండను సైతం లెక్కచేయకుండా ప్రజలు గ్యాలరీలో కూర్చుని, తమ అభిమాన నాయకుడిని చూసిన వెంటనే.. ఉప్పొంగిన ఉత్సాహంతో జై జగన్, సీఎం జగన్ అంటూ నినాదాలు చేయడం మరచిపోలేనిదన్నారు. పెద్దసంఖ్యలో ప్రజలు హాజరై వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలపడం సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ 58నెలల పాలనలో ఎందరి జీవితాల్లో వెలుగులు తెచ్చిందనేందుకు నిన్నటిదినం మదనపల్లె సభకు హాజరైన జనవాహిని, వారు కురిపించిన ప్రేమాభిమానాలే నిదర్శనమన్నారు. మదనపల్లె మేమంతా సిద్ధం సభలో కనిపించిన జనప్రభంజనం ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిందని, 2019 ఎన్నికల్లో రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. మదనపల్లెలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ గెలుపుతో హ్యాట్రిక్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, కౌన్సిలర్లు రామిశెట్టిశివయ్య, పాల్‌చంద్రశేఖర్, మేస్త్రీశ్రీనివాసులు, ప్రసాద్‌బాబు, ఈశ్వర్‌నాయక్, రేణుక, కరీముల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు ముబషీర్ అహ్మద్, పసుపురవి, ఎల్ఐసీ.సుధాకర్, వినుతాభాయి, కోటూరిఈశ్వర్, జేసీఎస్ కన్వీనర్ మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

మదనపల్లె సిటీ : పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ప్రజల మధ్య సోదరభావం, మతసామరస్యాన్ని పరిమళింపజేస్తుందని వైఎస్సార్‌సీపీ మదనపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.నిసార్ అహ్మద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బాబు కాలనీ మస్జిద్‌వద్ద ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పవిత్ర దైవారాధనకు, ధార్మిక చింతనకు, దైవభక్తికి శ్రమశిక్షణకు, దాతృత్వానికి రంజాన్ మాసం ఆలవాలమన్నారు. మనిషి సత్ప్రవర్తనలో నడవడానికి రంజాన్ ఉపవాసాలు ఉపకరిస్తాయన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ దైవం అనుసరించిన మార్గంలో నడవాలన్నారు.

టీడీపీ నుంచి భారీగా వైఎస్సార్‌సీపీలో చేరిక



తరిగొండ, మొరంపల్లె గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ, మొరంపల్లె గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కుటుంబాలు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా పెద్ద ఎత్తున బాణా సంచాపేల్చి వారి ఘన స్వాగతం పలికారు. అనంతరం తరిగొండకు చెందిన మాజీ వైస్ ఎంపీపీ రెడ్డినరసింహారెడ్డి, మొరంపల్లెకు చెందిన గంగిరెడ్డితో పాటు 55 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, జగనన్న పథకాలను చూసి పలువురు పార్టీలోకి రావడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్, మాజీ జెడ్పీటీసీ చింతల శివానందరెడ్డి, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నక్కాచంద్రశేఖర్, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, ఎల్వీరమణ, తరిగొండ ప్రకాష్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్లు నీళ్ల శ్రీనివాసులు, రెడ్డికుమార్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచ్‌లు యల్లారెడ్డి, విశ్వనాథ్,రౌనఖ్‌భాషా, రామ్ ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇదే స్ఫూర్తి కొనసాగాలి

– ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



బి.కొత్తకోట : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర విజయవంతం కోసం కృషి చేసిన వైఎస్సార్‌సీపీ శ్రేణుల కృషి ఇలాగే కొనసాగాలని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ తంబళ్లపల్లె అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం నియోజకవర్గంలో 40 కిలోమీటర్ల బస్సు యాత్ర సాగితే పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై అడుగడుగునా ఘనస్వాగతం పలికారని అన్నారు. అలాగే మదనపల్లెలో జరిగిన సభను విజయవంతం చేసారని అన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతికార్యకర్త, నాయకులు పనిచేయాలని కోరారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేస్తున్న ప్రతి కార్యకర్త, ప్రతి నాయకునికి కృతజ్ఞతలు తెలిపారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



కలికిరి : రాజీనామా పత్రాలు చూపుతున్న గుట్టపాళెం వలంటీర్లు



పెద్దమండ్యం : రాజీనామా పత్రాలను కార్యదర్శికి ఇస్తున్న వలంటీర్లు



కలకడ: ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

కలికిరి : మండలంలోని గుట్టపాళెం గ్రామ పంచాయతీ పరిధిలోని వలంటీర్లు మూకుమ్మడిగా తమ వలంటీరు విధులకు రాజీనామా చేశారు. రాజకీయ పరంగా వలంటీర్లపై అనవసర ఆరోపణల నేపథ్యంలో గుట్టపాళెం గ్రామ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 24 మంది వలంటీర్లు మూకుమ్మడిగ బుధవారం సచివాలయ కార్యదర్శి గోపికి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. గత 50 నెలలుగా నిస్వార్థంగా ప్రజలకు ఇంటింటికి సేవలందించిన తమపై ప్రతిపక్షాలు అర్థరహిత ఆరోపణలు చేయడంతో పాటు, కోర్టులకెక్కి తమ విధులను అడ్డుకోవడం దారుణమన్నారు. వలంటీర్ల సేవలు నిలిచిపోతే పింఛనుదారుల దారుణ కష్టాలు చూస్తున్నామన్నారు. ఇందుకు ప్రతిపక్షాలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

గుడిబండలో..

కలకడ : కలకడ మండలం గుడిబండ గ్రామ పంచాయతీ పరిధిలోని వలంటీర్‌లు అందరూ రాజీనామా చేశారు. బుధవారం ఈ మేరకు రాజీనామా పత్రాలను కలకడ ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్‌లు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానికంగా మాకు గ్రామంలోని సేవచేయడానికి అవకాశం కల్పించారన్నారు. గౌరవ వేతనం ఇచ్చి జీవనోపాధి కల్పించి గుర్తింపును ఇచ్చారన్నారు. కేవలం పింఛన్ అందజేయడమే కాకుండా కరోన సమయంలో, వేసవిలో, అపదలో మాకు అవకాశం ఉన్నంత వరకూ సహాయ సహకారాలు అందించామన్నారు. నేటి నుంచి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

వెలిగల్లులో 19 మంది..

పెద్దమండ్యం : మండలంలోని వెలిగల్లు గ్రామ పంచాయతీలో వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. గ్రామ పరిధిలో ఉన్న 19 మంది వలంటిర్లు తమ రాజీనామా పత్రాలను గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి శైలజకు అందజేశారు. ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించడంలో వివక్షత లేకుండా సేవలు అందిస్తే ప్రతి పక్షనాయకులు వలంటీర్లపై కుట్రలు చేశారని వారు ఆరోపించారు. ప్రతినెలా పింఛన్లు 1వ తేదీన లబ్ధిదారులకు అందిస్తుంటే పింఛను ఇవ్వకుండా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.